

## కొండ్రుపాడు వద్ద రోడ్డు ఆక్రమణల తొలగింపునకు అధికారుల నోటీసులు

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 01:**
చిలకలూరిపేట – నరసరావుపేట ప్రధాన రహదారిపై ఉన్న కొండ్రుపాడు సమీపంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన పూరి ఇల్లను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మార్గంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగకుండా, నిర్దేశిత గడువులోగా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత కూడా ఖాళీ చేయకపోతే నిబంధనల ప్రకారం తొలగింపు చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# పెమ్మసాని ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై సమీక్ష

- గుంటూరువిజయవాడ ప్రాంతంలో కీలక రహదారి పనులపై ప్రత్యేక దృష్టి
- రెండు వారాల్లో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



**గుంటూరు : పెన్ పవర్, సెప్టెంబర్, 1**
గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాంతీయ అధికారి, ప్రాజెక్టు డైరెక్టర్లతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరువిజయవాడ పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారులకు సంబంధించిన కీలక సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై మంత్రి అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా పశ్చిమ బైపాస్‌పై చిన్నకాకాని వద్ద వంతెన నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ, తదుపరి కార్యాచరణ, పనుల కాలపట్టికపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బయటి వలయ రహదారి ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలు, వాటి పురోగతిపై సమీక్షించారు. సుద్దపల్లి డొంక వద్ద రహదారి కింద నిర్మించే మార్గం, మురుగు నీటి కాలువ, వెంకటపాలెం టోల్ కేంద్రం సమస్యలు, పెదకాకాని వై జంక్షన్‌ను ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలపై కూడా చర్చించారు. కొలనుకొండ, సుద్దపల్లి డొంక వద్ద నిర్మాణంలో ఉన్న రెండు రహదారి పైవంతెనల పనులు నెమ్మదిగా సాగుతున్న అంశంపై మంత్రి ఆరా తీశారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అమృత్ రెండో దశ పథకం కింద పైప్‌లైన్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసే అంశంపైనా సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారి మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని, ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని, పెండింగ్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని మంత్రి అధికారులకు సూచించారు. అన్ని అంశాలపై అవసరమైన నివేదికలను రెండు వారాల్లో సిద్ధం చేసి అందజేయాలని అధికారులను మంత్రి పెమ్మసాని ఆదేశించారు.
సమావేశంలో జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి హరికృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ సుర్జేవాలా, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 812 కుటుంబాలకు శాశ్వత పట్టాలు

### ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంత్రి డా. పెమ్మసాని



**గుంటూరు : పెన్ పవర్, సెప్టెంబర్, 1,**
వట్టిచెరుకూరులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పార్లమెంట్ సభ్యులు భాష్యం రామకృష్ణ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పంపిణీ చేశారు. అనంతరం వట్టిచెరుకూరు, పుల్లటగుంట, ఏటుకూరు గ్రామాల్లో సుమారు 120 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు పరిష్కారం చూపుతూ 812 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా భూమిపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న 812 కుటుంబాలకు శాశ్వత హక్కులు లభించాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు పరిష్కారం లభించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ హక్కులు అందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అర్హుల ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 1**
పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని 27వ వార్డు బావాజీపేటలో అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు వారి ఇంటి వద్దకే నేరుగా అందించడం ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందో ఆ లక్ష్యం నెరవేరేలా లబ్ధిదారులు వాటిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.
కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- చీరాల 1వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే మాలకొండయ్య
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**చీరాల, సెప్టెంబర్ 1(పెన్ పవర్) :**
చీరాల నియోజకవర్గంలో సెప్టెంబర్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు రాంనగర్ రంగారావు కాలనీలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వార్డులో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చీరాల నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, సజ్జ హేమలత, వార్డు అధ్యక్షులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలకు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గవర్నర్ గోల్డ్ మెడల్

- విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- రెడ్‌క్రాస్ సేవల విస్తరణ, నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదులో కృషికి గుర్తింపు



**విజయవాడ, సెప్టెంబర్ 1(పెన్ పవర్) :**
బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు ప్రతిష్ఠాత్మక గవర్నర్ గోల్డ్ మెడల్ లభించింది. రెడ్‌క్రాస్ సేవల్లో విశేష కృషి చేసినందుకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును స్వీకరించారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవల విస్తరణతో పాటు నిధుల సమీకరణ, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుకు కలెక్టర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు అధికారులు తెలిపారు. వరదలు, వైద్య సేవలు, రక్తదాన శిబిరాలు, పేదలు, బాధితులకు సహాయ కార్యక్రమాల నిర్వహణలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు ఆయన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌కు గవర్నర్ గోల్డ్ మెడల్ లభించడంపై జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మానవతా సేవలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని పలువురు అభినందనలు తెలిపారు.

## ఇంటింటికీ టీడీపీ ప్రచారంలో ఎమ్మెల్యే కొండయ్య

- కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం
- చీరాల నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసిన ఎమ్మెల్యే



**చీరాల, సెప్టెంబర్ 1 (పెన్ పవర్):**
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ' ప్రచార కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. చీరాల మండలం చీరాల నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.
ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసినట్లు పేర్కొంటున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజల నుంచి స్థానిక సమస్యలు, అభిప్రాయాలను కూడా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమం అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మాలకొండయ్య పేర్కొన్నారు. ప్రజల సహకారం, ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# కదిలిన ఇనాం భూముల ఫైలు




ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ సెక్రటరీ చేతన్ తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ....



సీసీఎల్ఏ జి.జయలక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు....

- ఏలూరి నిరంతర కృషితో ప్రభుత్వ పరిశీలనకు చేరిన ప్రతిపాదనలు
- నాలుగు గ్రామాల రైతులకు త్వరలో పట్టాలు వచ్చే అవకాశం

**పర్చూరు, సెప్టెంబర్ 1 (పెన్ పవర్):**
బాపట్ల జిల్లా పర్చూరు, మార్టూరు మండలాల పరిధిలోని చెన్నంబొట్లవారిపాలెం, ఏదుబాడు, లక్కవరం, జంగమహేశ్వరపురం గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇనాం భూముల సెటిల్‌మెంట్ సమస్యపై కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ అంశంపై ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో సంబంధిత ఫైలు ప్రభుత్వ పరిశీలనకు చేరింది. భూ కమిషనర్ కార్యాలయం (సీసీఎల్ఏ) నుంచి ప్రభుత్వ రెవెన్యూ (లాండ్స్) ముఖ్య కార్యదర్శికి ఇటీవల ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. నాలుగు గ్రామాల్లో భూముల సర్వే పూర్తయిన నేపథ్యంలో, రైతులకు పట్టాల మంజూరుకు సంబంధించి ఇనాం భూముల రద్దు చట్టంలోని సెక్షన్ 11 నుంచి మినహాయింపు వర్తింపజేయాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లా కలెక్టర్ నివేదిక ఆధారంగా ఈ ఫైలు సిద్ధమైనట్లు అధికారులు పేర్కొన్నారు. 1956 నాటి ఇనాంల రద్దు చట్టం పరిధిలోకి వచ్చే ఈ గ్రామాల్లో భూముల బదిలీలు, పాత రికార్డుల లభ్యత తదితర అంశాల కారణంగా రైతుల అర్హత నిర్ధారణ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. ఈ నాలుగు గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల భూములకు సంబంధించిన సమస్య పరిష్కారం కోసం రైతులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గతంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్లను కలిసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ అంశంపై స్పందించడంతో ఫైలు ముందుకు కదిలినట్లు వెల్లడించారు. ఫైలు ప్రభుత్వ స్థాయిలో పరిశీలనకు చేరడంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా భూమి హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు త్వరలో న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## రామన్నపేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 1**
గూడూరు మండలం రామన్నపేట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మురాల ధనేష్, గ్రామ రెవెన్యూ అధికారి నరేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో 56,526 మందికి 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు

## కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 1:**
నెల ప్రారంభంలోనే 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరడంతో పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఆర్థికంగా ఎంతో ఊరట లభిస్తోందని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1వ తేదీనే పెన్షన్ల పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం సంపత్ నగర్ ప్రాంతంలో కమిషనర్ స్వయంగా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గుంటూరు నగరంలో 1,200 మంది క్షేత్రస్థాయి సిబ్బంది, 57 మంది పర్యవేక్షణ అధికారులు ద్వారా 26 కేటగిరీలకు చెందిన 56,526 మంది పెన్షనర్లకు సుమారు రూ.24.67 కోట్ల పెన్షన్ సొమ్మును పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రంలోపు నగరంలో 100 శాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.లబ్ధిదారులు పెన్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సిబ్బంది స్వయంగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించాలని కమిషనర్ ఆదేశించారు.

# క్రిస్టియన్ పేటలో పింఛన్లుఅందజేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 1,**
కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకటో తేదీ ఉదయాన్నే అవ్వతాతల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని, ఇదొక పండుగ రోజని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక క్రిస్టియన్ పేటలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రతి ఇంటికీ పింఛన్ వస్తుందా ? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ తీసుకున్న లబ్ధిదారులు ఒకటో తేదీన ఇంటికి పెద్ద కొడుకులా తమను సీఎం చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా పింఛన్ అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో కేవలం రూ.2 వేలు మాత్రమే పింఛన్ ఉంటే ఏపీలో రూ.4 వేలు అందిస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ.6 వేలు, ప్రత్యేక పరిస్థితుల్లో వారికి రూ.10 వేలు, రూ.15 వేలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 వేల కోట్ల విలువైన పింఛన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎరియర్స్ తోపాటు పింఛన్లు రెట్టింపు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచి లబ్ధిదారులను మోసం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో కుటుంబంలో ఎవరైనా పింఛన్ తీసుకుంటూ ఎవరైనా మరణిస్తే భాగస్వామికి మరుసటి నెలలో స్పౌజ్ కేటగిరీలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని, ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని పింఛన్లు స్వయంగా మంజూరు చేయించామన్నారు.

# డా. ఎన్టీఆర్ వైద్య సేవలో పారదర్శకతకు ప్రాధాన్యం నగదు రహిత వైద్యం అందించడమే లక్ష్యం

## డా. ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహణ




**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 01:**
జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో డా. ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో డా. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలు, పేషెంట్ల నుండి అందిన ఫిర్యాదులు మరియు వాటి పరిష్కారంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు అందిన మొత్తం 152 ఫిర్యాదులను కమిటీ పరిశీలించింది. వీటిలో పేషెంట్ల నుండి నగదు వసూలు చేయడం మరియు ఇతర తీవ్రమైన ఆరోపణలకు సంబంధించిన 8 ఫిర్యాదులను జిల్లా కో-ఆర్డినేటర్ డా. జి. చంద్ర శేఖర్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రెండు ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత వైద్య నిపుణుల సహకారంతో వాస్తవాలను నిర్ధారించి, రెండు వారాలలోపు పూర్తి స్థాయి విచారణ నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డా. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అర్హులైన పేషెంట్లకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలు అందేలా ఆసుపత్రి యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పథకం పరిధిలో చికిత్స పొందుతున్న పేషెంట్ల నుండి ఎటువంటి పరిస్థితుల్లోనూ నగదు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రోగనిరోధక టీకాల అధికారి డా. హనుమ కుమార్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య సేవల సమన్వయ అధికారి డా. ఎం. ప్రసూనా, జిల్లా కో-ఆర్డినేటర్ డా. జి. చంద్ర శేఖర్ మరియు డా. ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమం అందిస్తూ.. సమస్యలు ఆలకిస్తూ

## ---- పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత



**పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 1**
పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. పెడన మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, వృద్ధాప్యంలో ఉన్న వారికి జీవన భరోసా, వితంతువులకు అండ, దివ్యాంగులకు చేయూతగా నిలుస్తోందన్నారు. పేద కుటుంబాలు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డొక్కు కొండయ్య, అర్బన్ స్వర్ణ వార్డు అధికారి ఆర్.భవానీ శంకర్, వార్డు ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలాగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 01:**
ఉమ్మడి కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలోని 11, 22, 23, 28వ వార్డుల్లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాతో మరియు మునిసిపల్ కమీషనర్ రమ్య కీర్తన తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా దాదాపు రూ.3 వేల కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అమరావతి రాజధాని, పోలవరం, నదుల అనుసంధానం వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2న మంత్రి నారా లోకేష్ నరసరావుపేట పర్యటనకు రానున్న నేపథ్యంలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎస్ఆర్‌కేటీ కాలనీ నుంచి ప్రారంభమయ్యే పర్యటన చిలకలూరిపేట రోడ్డు ఫ్లైఓవర్, మల్లమ్మ సెంటర్, వినుకొండ ఫ్లైఓవర్ మీదుగా జేఎన్‌టీయూకే కళాశాలకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ నూతన వసతి భవనాల ప్రారంభంతో పాటు కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లావ్యాప్తంగా 2.26 లక్షల మందికి పింఛన్లు

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటీలోని 28వ వార్డులో జిల్లా స్థాయి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతో కలిసి నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నాటికే జిల్లావ్యాప్తంగా 80 శాతం పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సాయంత్రానికి నూరు శాతం పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లాలో అర్హులైన సుమారు 2.26 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.116 కోట్ల మేర పింఛన్లు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ ప్రక్రియను చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటనకు భారీగా తరలిరావాలి

## టీడీపీ క్యాడర్ సమావేశంలో ఎమ్మెల్యే అరవిందబాబు పిలుపు



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 01:**
ఐటి, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సెప్టెంబరు 2న నరసరావుపేటలో నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం నరసరావుపేట గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఎమ్మెల్సీ, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ బెందుల తిరుమల నాయుడు (బీటీ నాయుడు), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనాదేవి, నియోజకవర్గ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ సెప్టెంబరు 2న జేఎన్టీయూకే లో వసతి గృహాల ప్రారంభోత్సవం, టిడిపి నియోజకవర్గస్థాయి క్యాడర్ మీటింగ్ లకు నారా లోకేష్ నరసరావుపేటకు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. వేలాది మందితో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ నారా లోకేష్ పర్యటనకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరానున్నాయని తెలిపారు. పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసినట్లు చెప్పారు.

<u>అభివృద్ధి క్రెడిట్‌ను జగన్ కొట్టేయాలని చూస్తున్నారు– జీవీ ఆంజనేయులు</u>

ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీపై విమర్శలు చేశారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల క్రెడిట్‌ను మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిని క్రెడిట్ చోరీగా ఆయన అభివర్ణించారు. వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి, పూర్తి చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తరలిరావాలని కోరారు.

# బీసీ మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 01:**
బీసీ మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ విద్య, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఐఎంఏ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కదం నాగజ్యోతి నియామక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ వర్గాలకు చెందిన ప్రజలు తమ పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. విద్య, ఉద్యోగం, ఆర్థికంగా ఎదగడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను విద్య ద్వారా వైద్యుడిగా, అనంతరం ప్రజాప్రతినిధిగా ఎదిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఎవరూ ఎవరికంటే తక్కువ కాదు. బీసీ కుటుంబాల్లోని పిల్లలు ధైర్యంగా చదువుకుని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి. ముఖ్యంగా చిన్న బీసీ కులాలకు చెందిన కుటుంబాలకు అండగా నిలవాలి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికల్లో కులం, మతం, డబ్బు కంటే అభ్యర్థి వ్యక్తిత్వం, పనితీరును పరిగణనలోకి తీసుకుంటారని అరవింద బాబు అన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేశారు. విధాన నిర్ణయాల్లో బీసీ మహిళలకు భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు కదం నాగజ్యోతి మాట్లాడుతూ బీసీ మహిళా విభాగాన్ని గ్రామస్థాయి వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. బీసీ మహిళల హక్కులు, రక్షణ కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కదం నాగజ్యోతిని ఎమ్మెల్యే అరవింద బాబు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ జాడీ శ్వేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బిళ్లకంటి శ్రీనివాసరావు, యువజన నాయకులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి

## కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 1**
బ్రాడీపేట, కాకుమానువారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న మరియు పూర్తైన అభివృద్ధి పనులను, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే పనులు వేగంగా, సమర్థవంతంగా జరుగుతాయన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు పెండింగ్ లో లేకుండా కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణ సమయంలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని, డ్రైన్లు, రోడ్ కి మధ్య లెవల్ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాడీపేటలో త్రాగునీటి శ్యాంపిల్స్ తీయడంలో నిర్లక్ష్యంగా ఉన్న ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్ఈని, రోడ్లపై నిర్మాణ సామగ్రి వేసిన వారికి నిర్మాణ పనులు ఆపాలని నోటీసు ఇవ్వాలని ఏసిపిని ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, ఖాళీ స్థలాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. లాంచేస్టర్ రోడ్ మెయిన్ డ్రైన్ లో పూడికను తొలగించాలన్నారు.పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈలు విష్ణు, వేణు, డిఈఈలు వెంకటరమణ, సతీష్, చైతన్య, ఏసిపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



# సేవా సంకల్ప ఉత్సవాల్లో ఘనంగా 76 వేల లేఖల కార్యక్రమం







**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 1**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అమరావతిలోని వీఐటీ-ఏపీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 76 వేల లేఖలతో శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రేమతో రాసిన చిన్న లేఖ కూడా ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. 2014కు ముందు దేశం ఎదుర్కొన్న పేదరికం, నిరుద్యోగం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను ప్రస్తావిస్తూ, మోదీ ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. బ్యాంకింగ్, పన్నులు, టెలికాం, కార్మిక, నేర చట్టాల్లో సంస్కరణలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తోందని తెలిపారు. గత పదేళ్లలో వచ్చిన మార్పులను ప్రజలు గమనించాలని కోరారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. కష్టపడే మనస్తత్వమే మోదీని ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా చేసిందన్నారు. ప్రపంచ దేశాల మధ్య భారత్ గౌరవం పెరిగిందని, ఆర్థికంగా దేశం బలపడుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పణతల సురేష్, శాసనసభ్యుడు శ్రావణ్ కుమార్, పాతూరి నాగభూషణం, నిర్మల కిషోర్, చీఫ్ పోస్టుమాస్టర్ బీపీ శ్రీదేవి, వీఐటీ-ఏపీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో 'సరస్ - 2026' నిర్వహణకు స్థల పరిశీలన మంత్రి డా. పెమ్మసాని, ఎంపీ కేశినేని





**విజయవాడ:పెన్ పవర్, సెప్టెంబర్, 1**

గుంటూరులో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'సరస్2026' కార్యక్రమాన్ని విజయవాడలోనూ ఘనంగా నిర్వహించేందుకు గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడలో సరస్ కార్యక్రమం నిర్వహణకు అనువైన ప్రదేశాలపై నాయకులు, అధికారులు దృష్టి సారించారు. నగరంలోని పున్నమి ఘాట్ పరిసరాల్లో గల ఖాళీ స్థలాల్లో సరస్ – 2026 కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే అంశంపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం స్థలాన్ని పరిశీలించారు.
సరస్ కార్యక్రమం ద్వారా 700+ స్టాళ్లను ఏర్పాటు చేయబోతున్నామని, వివిధ రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు తమ తమ ఉత్పత్తులను విజయవాడకు తీసుకురాబోతున్నారని ఈ సందర్భంగా పెమ్మసాని గారు వివరించారు. లక్షలాదిమంది ప్రజలు వీరు సారస్ మేళాను ఆస్వాదించబోతున్న క్రమంలో భద్రత, ట్రాఫిక్, వైద్య, పారిశుద్ధ్య తదితర ఏర్పాట్లపై పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల మహిళా స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులను నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.పున్నమి ఘాట్ పరిసరాల్లో కార్యక్రమానికి అవసరమైన వసతులు, సందర్శకులకు సౌకర్యాలు, స్టాళ్ల ఏర్పాటుకు అనుకూలత, పార్కింగ్ తదితర అంశాలను కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేసినేని చిన్ని పరిశీలించారు. విజయవాడలో సరస్ – 2026ను విజయవంతంగా నిర్వహించి, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు.

# జనసేనాని పవన్ కళ్యాణ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 1**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని ముందుగా పురస్కరించుకుని గుంటూరు జిల్లా జనసేన మీడియా బ్యూరో చీఫ్ నర్రా లక్ష్మీ సునీత నాయుడు ఆధ్వర్యంలో ఆయనకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా సేవే పరమావధిగా, కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ, పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న జనసేనాని పవన్ కళ్యాణ్‌కు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయురారోగ్యాలతో, ఆనంద విశేషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగుతూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# అక్వారైతు ఇంటిపై దాడి కేసు ఛేదించిన చీరాల పోలీసులు



-ముగ్గురు నిందితుల అరెస్ట్.. కారు, కర్రలు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వ్యవసాయ భూమి వివాదమే దాడికి కారణం.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు

**చీరాల, సెప్టెంబర్ 1 (పెన్ పవర్):**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొత్తపేటలో ఆక్వారైతు చెరుకూరి లక్ష్మీనారాయణ ఇంటిపై జరిగిన దాడి కేసును చీరాల టూ టౌన్ పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఒక కారు, కర్రలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.డి. మోయిన్ వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కొందరు దుండగులు ముసుగులు ధరించి లక్ష్మీనారాయణ ఇంటిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇంటి అద్దాలతో పాటు ఆవరణలో ఉన్న కారును ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించిన పోలీసులు దాడికి పాల్పడిన వారిని గుర్తించారు. ఆక్కాయిపాలెం పరిధిలోని 4 ఎకరాల 50 సెంట్ల వ్యవసాయ భూమి కొనుగోలు వ్యవహారంలో కొండ్రు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న శ్రీనివాసరావు, పద్మారావు, విజయకుమార్‌కు నగదు సుపారీ ఇచ్చి లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేయించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి కారు, కర్రలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ ఎం.డి. మోయిన్ వెల్లడించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు ఘన ఏర్పాట్లు

**- ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**- బైక్ ర్యాలీ, ఆత్మీయ సమావేశానికి జనసేన శ్రేణుల సన్నాహాలు**



**చీరాల, సెప్టెంబర్ 1 (పెన్ పవర్):**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చీరాల నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు జనసేన పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం చీరాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేడుకలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.జనసేన పార్టీ చీరాల నియోజకవర్గ పరిశీలకులు ఆలా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రసాద్ థియేటర్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 9 గంటలకు ప్రసాద్ థియేటర్ వద్ద నుంచి సప్తగిరి లాడ్జ్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.సప్తగిరి లాడ్జ్ ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు. జన్మదిన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్కే నాయుడు, ఐటీ కోఆర్డినేటర్ భూపతి మనోజ్ కుమార్, వీర మహిళ ఏఎంసీ డైరెక్టర్ కారంపూడి పద్మిని, పసుపులేటి సాయి, షేక్ హుర్ భాష, తోట అశోక్ చక్రవర్తి, అలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ హసీనా తల్లిదండ్రులు షేక్ రిహానా, మస్తాన్ లకు ప్రభుత్వ ఆర్థిక సాయం

## రూ.10 లక్షల చెక్కును అందచేసిన ప్రత్తిపాటి.

**చిలకలూరిపేట ప్రజలు చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటారు : ప్రత్తిపాటి**

**మైనారిటీ బిడ్డను బలితీసుకున్న దుర్మార్గుడిని కూటమి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి : అన్సర్ ఖాన్ (ముఫ్తీ -మతపెద్ద).**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 01:**

చిలకలూరిపేట ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటారని, నిన్న రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాల్ని, నేడు ప్రేమోన్మాది చేతిలో హత్యగావింపబడిన షేక్ హసీనా కుటుంబాన్ని ఆదుకున్న గొప్ప మానవతా మూర్తి చంద్రబాబు అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.గతనెల 4న ప్రేమోన్మాది బాలసైదులు చేతిలో దారుణంగా హత్యగావింపబడిన షేక్ హసీనా కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి మంగళవారం మృతురాలి తల్లిదండ్రులకు అందచేశారు. స్థానిక కూటమి నాయకులు, మైనారిటీ మతపెద్దలతో కలిసి 38వ వార్డులోని హసీనా ఇంటికి వెళ్లిన ప్రత్తిపాటి.. ఆమె తల్లిదండ్రులు షేక్ రిహానా, మస్తాన్ లను పరామర్శించి, రూ. 10 లక్షల నగదు చెక్కుని వారికి అందచేశారు. అనంతరం ప్రత్తిపాటి, షేక్ రిహానా, మతపెద్ద (ముఫ్తీ) అన్సర్ ఖాన్ విలేకరులతో మాట్లాడారు.

హసీనా కుటుంబానికి జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు : ప్రత్తిపాటి

ఆగస్ట్ 4న ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన మైనారిటీ యువతి షేక్ హసీనా కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకున్నామని, మృతురాలి తల్లిదండ్రులు, చెల్లెలికి భవిష్యత్ లోనూ అన్నివిధాలా అండగా ఉంటామని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అన్యాయం హసీనా కుటుంబానికి జరిగిందని ముఖ్యమంత్రికి తెలియచేసిన వెంటనే, ఆయన వెంటనే స్పందించి పెద్ద మనసుతో సాయం చేద్దామని చెప్పారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రభుత్వ నుంచి హసీనా కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల సాయాన్ని ఆమె తల్లిదండ్రులు రిహానా, మస్తాన్ లకు అందచేశామన్నారు.

నా బిడ్డను చంపిన దుర్మార్గుడికి ఎవరూ మద్దతు ఇవ్వకూడదు : షేక్ రిహానా (హసీనా తల్లి)

నా బిడ్డను చంపిన దుర్మార్గుడికి మీడియా, సోషల్ మీడియా సహా ఎవరూ మద్దతు ఇవ్వకూడదని హసీనా తల్లి షేక్ రిహానా విజ్ఞప్తి చేశారు. నేరస్తుడిని ప్రభుత్వం కఠినంగా శిక్షించి, తమకు తగిన న్యాయం చేయాలన్నారు. చేతికంది వచ్చిన పెద్దబిడ్డను కోల్పోయిన మాకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా నిలిచినందుకు వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని రిహానా తెలియచేశారు. ఎమ్మెల్యే పుల్లారావు మాకు కొండంత అండగా నిలిచారని, చంద్రబాబు అందించిన ఆర్థిక సాయంతో చిన్నకూతుర్ని బాగా చదివించి, ప్రయోజకురాల్ని చేస్తానని రిహానా తెలిపారు.

ముఖ్యమంత్రి మా అక్క కుటుంబానికి న్యాయం చేయకుంటే.. అందరూ నిలువునా సమాధి అయ్యేవారు : షేక్ రేష్మ (హసీనా పిన్ని)


మాకు జరిగిన అన్యాయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పందించారు. ఆనాడు మాతో మాట్లాడి దేవుడిలా మాకు అండగా నిలిచారు. ఒక దుర్మార్గుడి కారణంగా మా కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మాకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలిచింది, ఇంటింటికీ తెలుగుదేశం అంటూ.. మా ఇంటికి తెలుగుదేశం అండగా నిలిచింది. మాలాంటి పేద కుటుంబాలకు అండగా నిలిస్తే, కూటమి ప్రభుత్వాన్ని పేదలు ఎప్పటికీ విడిచిపెట్టరు. మా అమ్మాయిని చంపేసిన బాలసైదుల్ని ఎవరూ సమర్థించకూడదు. అతన్ని కఠినంగా శిక్షిస్తేనే ప్రభుత్వంపై మాలాంటి వారికి ఇంకా నమ్మకం పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు ఆర్థిక సాయం చేయకుంటే.. మా అక్క, ఆమె కుటుంబం మొత్తం ఇక్కడే నిలువునా సమాధి అయ్యేవారు." అని హసీనా పిన్ని షేక్ రేష్మ గద్గద స్వరంతో చెప్పారు.

మైనారిటీ కుటుంబానికి న్యాయం చేసిన చంద్రబాబుకు, ప్రభుత్వానికి అల్లాహ్ ఆశీస్సులు ఉండాలి : అన్సర్ ఖాన్ : ముఫ్తీ (మతపెద్ద)

హసీనా కుటుంబాన్ని ఆదుకుంటామన్న వాగ్దానాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి నిలబెట్టుకున్నారని, ఆయన ద్వారా మైనారిటీ కుటుంబానికి న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వానికి అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తున్నామని ముఫ్తీ అన్సర్ ఖాన్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుతో మైనారిటీ కుటుంబానికి అండగా నిలిచారని, వారికి మైనారిటీల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హసీనా మరణంతో మస్తాన్ కుటుంబం దిక్కులేనిది అయిందని, వారి బిడ్డకు జరిగిన అన్యాయం భవిష్యత్ లో మరెవరికీ జరగకుండా కూటమిప్రభుత్వం ఆడబిడ్డల రక్షణ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని అన్సర్ ఖాన్ కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, జంగా వినాయకరావు, పిల్లి కోటేశ్వరరావు, ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ



**గుంటూరు, సెప్టెంబర్ 1:**

జిల్లాలో ప్రధానమంత్రి పోషణ్ పథకం అమలు తీరును మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రధానమంత్రి పోషణ్ పథకంపై జిల్లా స్థాయి స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ అమలు, పౌష్టికాహారం, వంటశాలల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భోజనం తయారీలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, వంటశాలలు, భోజన ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార స్థితిపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షణ చేయాలని, పథకం అమలులో ఎటువంటి లోపాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల వారీగా పథకం అమలు తీరును సమీక్షిస్తూ అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డా. సలీం భాష, డి ఎస్ ఓ కోమలి పద్మశ్రీ, సివిల్ సప్లైస్ డి యం నాగేశ్వర రావు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి, ఐ సి డి యస్ పిడి ప్రసూన, అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకులు లోకేష్ జిల్లా పర్యటనని చరిత్ర గర్వించేలా విజయవంతం చేద్దాం : ప్రత్తిపాటి

**ఏపీ జెన్ జీ ఆశలు, ఆశయాల్ని నిజం చేసే నిజమైన మిత్రుడు లోకేషే : ప్రత్తిపాటి**

**టీడీపీ శ్రేణుల అపూర్వ, ఆత్మీయ స్వాగతం.. మంత్రి లోకేష్ కు ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 01:**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాల అనంతరం తొలిసారి నరసరావుపేటలో జరుగుతున్న టీడీపీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి, ప్రజా నాయకులు నారా లోకేష్ పర్యటనని చరిత్ర గర్వించేలా విజయవంతం చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాతో పాటు, నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు, మిత్ర పక్షాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి, యువనేత లోకేశ్ కార్యక్రమాల్ని కనీవినీ ఎరుగని విధంగా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాలోకి అడుగుపెట్టింది మొదలు తిరిగి వెళ్లే వరకు ప్రతి కార్యక్రమం విజయవంతంలోనూ టీడీపీ శ్రేణుల ఉత్సాహపూరిత మార్క్ పనితీరు కనిపించాలని ప్రత్తిపాటి సూచించారు. స్వాగతం మొదలు.. తుది వీడ్కోలు వరకు ప్రతి చర్యలో కూటమిపార్టీల ఐక్యత ప్రతిబింబించాలన్నారు. ఏపీ జెన్ జీ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చే సమర్థుడు, జెన్ జీకి నమ్మకమైన మిత్రుడు లోకేషే అని ప్రత్తిపాటి తెలిపారు. లోకేష్ వినూత్న ఆలోచనలు, నిర్విరామ కృషి, అవగాహన శక్తి, సోషల్ మీడియా ప్రజెన్స్ యువతలో ఆయన క్రేజ్ పెంచుతున్నాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. లోకేష్ కార్యక్రమాల విజయవంతం కోసం నియోజకవర్గ స్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పర్యటనలో భాగంగా తొలుత మంత్రి లోకేశ్ జేఎన్ టీయూ కళాశాలలో రూ.70 కోట్లతో నిర్మించిన విద్యార్థుల నూతన వసతి భవనాల్ని ప్రారంభిస్తారన్నారు. ఈ భవనాల ప్రారంభంతో దాదాపు 1,400 మంది విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి సముదాయం అందుబాటులోకి వస్తుందన్నారు.

## కృష్ణ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలపై ఏపీఎస్ఎఫ్ దృష్టి



**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 1**

కృష్ణ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ (ఏపీఎస్ఎఫ్) నాయకులు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను కోరారు. విద్యార్థులు తమ సమస్యలను ఏపీఎస్ఎఫ్ నాయకత్వం దృష్టికి తీసుకురావడంతో స్పందించిన నాయకులు మంగళవారం వైస్ ఛాన్సలర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా కృష్ణ విశ్వవిద్యాలయ ఏపీఎస్ఎఫ్ అధ్యక్షుడు ఐనాల శ్రీనివాసరావు విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వైస్ ఛాన్సలర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.విద్యార్థి నాయకులు ప్రస్తావించిన అంశాలపై వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి సమస్యల పరిష్కారానికి ఏపీఎస్ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. అవసరమైతే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎటువంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

